NIZAMABAD EDITION

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ | శనివారం 30 మే 2026 | సంపుటి : 16 | సంచిక : 113 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528


# వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ విఫలం

## రైతుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోదా!

## రెండు రోజుల్లో ధాన్యం తూకం వేయకుంటే రణ రంగమే..

## ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



**నాగిరెడ్డిపేట,మే 29:** ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రెండు రోజుల్లో తూకం వేయకుంటే రణ రంగం సృష్టిస్తామని స్పష్టం చేశారు. రెండు నెలలు గడుస్తున్నా రైతుల ధాన్యం తూకం వేయడం లేదని, కాంటా చేసినా ధాన్యాన్ని కేంద్రం నుంచి తరలించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండంలోని గోలీలింగాల్,జలాల్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి కష్టమూ రాకుండా, రైతును రాజులా చూసిందన్నారు. ధాన్యం తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. అకాల వర్షం కారణంగా ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధికంగా వడ్లు పండించే మండలం నాగిరెడ్డిపేట్ అని పేర్కొన్నారు. ప్రజా పాలన పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కేవలం సోషల్ మీడియాకే పరిమితమయ్యాడని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించిన దాఖలాలులేవన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలు పంపించి, ధాన్యాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. జాజాల వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, సొసైటీ చైర్మన్ నర్సింహులు, మాజీ చైర్మన్ రాజరెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి,మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ వంశీగౌడ్,నరేశ్, నారాయణ, దుర్గారెడ్డి, ఫరీద్, జయరాజ్ తదితరులు ఉన్నారు.




# రైతులకు కష్టాలు.. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే

## సాగు చేసిన పంటలను అమ్ముకునేందుకు నానా తంటాలు

## జొన్న పంట మొత్తం కొనుగోలు చేయకుంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం

**నిజాంసాగర్**

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సాగు చేసిన పంటలను అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడాల్సి వస్తున్నదని, ప్రభుత్వానికి అన్నదాతల శాపం తప్పక తగులుతుందన్నారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, జాజాల సురేందర్, బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, ఉమ్మడి జిల్లాల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి వీజీగౌడ్, జుక్కల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మఠం భిక్షపతి, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. తాను మద్నూర్‌కు వచ్చే రహదారిలో ఓ హోటల్ వద్ద ఆగి ఓ వ్యక్తిని అడిగితే పరిస్థితి ఇలాగే ఉంటే హన్మంత్‌షిండే రావడం ఖాయమని అన్నాడని చెప్పారు. ఇప్పుడు కూడా ఈ సమావేశాన్ని చూస్తుంటే మనం ప్రతిపక్షంలో ఉన్నట్లు లేదని, అధికారంలో ఉన్నట్లుగా ఉన్నదని పేర్కొన్నారు. కార్యకర్తల జోష్ చూస్తుంటే రానున్న ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తున్నదని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎవరినీ పలుకరించినా ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారని, మళ్లీ కేసీఆర్ రావాలి అంటున్నారని వేముల తెలిపారు. జొన్న సాగు చేసి పంట చేతికొచ్చి సుమారు 45 రోజులు గడుస్తున్నా ఇంతవరకూ కొనుగోళ్లు పూర్తికాలేదన్నారు. జొన్నతోపాటు వరి ఇతర పంటలు సాగు చేసిన రైతన్నలు అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జొన్నపంట ఎకరాకు పది క్వింటాళ్లు కొనుగోలు చేస్తే మిగిలిన జొన్నలు ఎక్కడికి తీసుకెళ్లాలని ప్రశ్నించారు. రైతులు పండించిన పంట మొత్తాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. పింఛన్ రెట్టింపు, తులం బంగారం, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు భరోసా కింద రూ. 5 లక్షలు అంటూ హామీలు ఇచ్చి, గద్దెనెక్కిన కాంగ్రెస్.. అన్ని వర్గాల వారినీ మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజలు కూడా తాము మోసపోయామనే బాధలో ఉన్నారని తెలిపారు. రైతు డిక్లరేషన్ ప్రకటించి ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పంటలు కొనడం లేదని

# రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి...

## లేదంటే రైతులతో నిరసన కార్యక్రమాలు చేపడతాం.. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్





**నాగిరెడ్డిపేట్,మే29(ప్రజాజ్యోతి):** ధాన్యం కొనుగోళ్లను రెండు రోజుల్లో పూర్తి చేయాలని లేని యెడల రైతులతో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ అన్నారు.శుక్రవారం నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్ పెట్,ఆత్మకూర్,జలాల్ పూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కోనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా ధాన్యాన్ని కోనుగోలు చేయకుండా కాలయాపన చేస్తు రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని,తూకం వేసి ధాన్యం బస్తాలు నింపిన లారీలు రాకపోవడంతో గత రెండు రోజులు క్రితం ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని,రైతుల కష్టాలను పట్టించుకొనే నాథుడే లేరని, రెండు రోజుల్లో కోనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కోనుగోలు చేసి తరలించాలని లేకపోతే ప్రభుత్వ అసమర్థను నిరసిస్తూ రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అయితే కోనుగోలు కేంద్రాలు వైపు కన్నెత్తి చూసిందే లేదని ఎద్దేవా చేశారు.రైతులు కల్లాలో అరిగోస పడుతుంటే కనీసం ఇటువైపు చుసిన దాఖలు లేవన్నారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య,గోపాల్ పెట్ గ్రామా సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్,కన్నారెడ్డి సర్పంచ్ సాయిలు,మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు మోతె శ్రీనివాస్,నరేష్.ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలతో గ్రామీణ మహిళలకు ఆర్థిక బలం

కొండాపూర్ గ్రామంలో రుణాలు, ఆర్థిక సహాయాల పంపిణీ -- మహిళా సంఘాలకు ప్రోత్సాహం



**కామారెడ్డి రూరల్ మే 29 ప్రజా జ్యోతి** రాజంపేట మండలం కొండాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలు" కార్యక్రమంలో భాగంగా గ్రామ సంఘం ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి, జీవనోపాధి మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ మరియు సామాజిక అభివృద్ధే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీ కీసరి కృష్ణ, ఉప సర్పంచ్ శ్రీ బూరుగుపల్లి వెంకా గౌడ్ త్రివేణి గ్రామ సంఘ అధ్యక్షురాలు, ముఖ్య అతిథులుగా ఆర్‌ఎం శ్రీ కిరణ్ , ఏపీఎం శ్రీ రాజారెడ్డి హాజరై లబ్ధిదారులకు ఆర్థిక సహాయాలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా సాధన మహిళా సంఘానికి చెందిన బి. మౌనిక షాప్‌కట్టర్ గడ్డి కత్తిరించే యంత్రం ఏర్పాటు కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం మంజూరు చేయబడింది. ఈ సహాయంతో ఆమె స్వయం ఉపాధి కార్యకలాపాలను మరింత విస్తరించుకునే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. అలాగే స్నేహ మహిళా సంఘానికి చెందిన ఆరే నందిని బాయి నాటు కోళ్ల పెంపకం కోసం రూ.3 లక్షల రుణాన్ని గ్రామ సంఘం ద్వారా మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వ్యాపారాలు, జీవనోపాధి అవకాశాలను పెంపొందించడంలో ఈ తరహా సహాయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇక సాధన మహిళా సంఘ సభ్యురాలు బూరుగుపల్లి నవనీత రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది నిదర్శనమని అధికారులు తెలిపారు. అదేవిధంగా క్రాంతి స్వయం సహాయక సంఘానికి చెందిన ముగ్గురు సభ్యులకు చేపల వ్యాపార అభివృద్ధి కోసం పాము కార్యక్రమం కింద ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.30 వేల ఆర్థిక సహాయం మంజూరు చేయబడింది. లబ్ధిదారులుగా నిరోషా బాలమణి, అనూష, అభినయలు సహాయం అందుకున్నారు. సామాజిక సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ "మహాదేవి వికలాంగుల సంఘం" పేరుతో కొత్త వికలాంగుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘ సభ్యుల ఆర్థిక లావాదేవీలు సులభతరం కావడానికి బ్యాంకు ఖాతా ప్రారంభించే ప్రక్రియను కూడా ప్రారంభించారు.
అదనంగా గ్రామంలోని కిశోర బాలికల సాధికారత, ఆరోగ్య అవగాహన, విద్యా ప్రోత్సాహం మరియు నాయకత్వ లక్షణాల పెంపు లక్ష్యంగా మరో స్నేహ సంఘాన్ని ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలు గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతున్నాయని, మహిళలు మరియు ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడానికి ఈ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ గంగ ప్రసాద్, సీఏలు రజిత, భాగ్యలక్ష్మి, సాయిలు, గ్రామ సంఘ ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, స్నేహ సంఘాల సభ్యులు, వికలాంగుల సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతపూర్ గ్రామ అభివృద్ధికి సర్పంచ్ దత్తు కృషి అభినందనీయం..

ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**బిచ్కుంద (ప్రజా జ్యోతి ) మే 29**:మద్నూర్ మండలం అంతపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎంతో పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంతపూర్ గ్రామ సర్పంచ్ దత్తు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యువ నాయకుడిగా గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న దత్తు, సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, పారిశుధ్య పనులు, తాగునీటి సౌకర్యాల మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే నాయకుడిగా దత్తు గుర్తింపు పొందుతున్నారని స్థానికులు తెలిపారు. యువతకు ప్రోత్సాహం అందిస్తూ గ్రామ అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

68 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం
ఉన్నత విద్య, పోటీ పరీక్షలపై ప్రముఖుల మార్గనిర్దేశం

**కామారెడ్డి రూరల్ మే 29 ప్రజా జ్యోతి** కామారెడ్డి పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో యాదవ ఉద్యోగుల సంఘం (ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన "యాదవ ప్రతిభా పురస్కారాల" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం మరియు పదవ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన 68 మంది విద్యార్థులను సంఘం తరపున ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి, అభినందన పత్రాలు ప్రదానం చేసి వారి కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, సరైన మార్గనిర్దేశం మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఎల్లన్న యాదవ్ మాట్లాడుతూ విద్యే సమాజాభివృద్ధికి మూలమని, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు. కష్టపడి చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే నిరంతర సాధన, సమయపాలన ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. జిల్లా భూగర్భ జల శాఖ అధికారి సతీష్ యాదవ్ మాట్లాడుతూ ఉన్నత విద్య ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ సేవ చేసే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయన్న యాదవ్, కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం సంఘం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో విద్యార్థులకు సహాయం అందిస్తామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో కుంభాల లక్ష్మణ్ యాదవ్, లద్దూరి కృష్ణ యాదవ్, గొల్లపల్లి కృష్ణ యాదవ్, సంఘ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభా ప్రాంగణం విద్యార్థుల హర్షధ్వానాలతో మార్మోగింది. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. యాదవ ఉద్యోగుల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

## చిక్కడపల్లిలో ఘనంగా బారెడు పోచమ్మ పండుగ

**రుద్రూర్,మే 29(ప్రజా జ్యోతి) :** రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో శుక్రవారం బారెడు పోచమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్,వీడీసీ అధ్యక్షుడు కూర్మరాజు, గ్రామస్తులు రాజయ్య,కరణ్, కార్తీక్,అశోక్,గోపాల్,నాగనాథ్, నవీన్,సుధాకర్,శేఖర్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ పథకాల లబ్ధి చేరుస్తాం : తోట లక్ష్మీకాంతరావు



**నిజాంసాగర్ ప్రజా జ్యోతి మే 29** నిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మరియు డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఆడబిడ్డల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వారు వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా పాఠశాల ప్రచారం.. చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ఐ డిమాండ్




**జుక్కల్ ఆర్సి ప్రజాజ్యోతి మే 29**ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిఎస్ఎఫ్ఐ (డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బిచ్కుంద మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. డి ఎస్ ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ మాట్లాడుతూ బిచ్కుంద మండల కేంద్రంలో "న్యూ ఆర్కిడ్స్" పేరుతో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే పాఠశాల ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.
ఇలాంటి వ్యవహారాలపై మండల విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి సంబంధిత యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి మరియు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ ఎఫ్ఐ నాయకులు బబ్లు, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## త్రాగునీటి బోర్ల వివాదం

కర్రలతో దాడి ఇద్దరికీ గాయాలు
ఇద్దరిపై కేసు నమోదు ఎస్ఐ పి. రాజశేఖర్






**రామారెడ్డి మే 29 (ప్రజా జ్యోతి)**రామారెడ్డి మండలంగోకుల్ తండా గ్రామపంచాయతీ చెందిన భగవత్ వినోద్ / సక్రు, ఇచ్చిన ఫిర్యాదు ఏమనగా గోకుల్ తండా గ్రామంలో 30 సంవత్సరాల క్రితం ఫారెస్ట్ భూమిలో గ్రామస్తులకు త్రాగునీటి వసతి కోసం రెండు బోర్లు వేయడం జరిగింది. ఈ మధ్యకాలంలో వారి గ్రామస్తులైన మాలవత్ సవాయిరం మరియు అతని కుటుంబ సభ్యులు గ్రామపంచాయతీ కి సంబంధించిన బోరు యొక్క భూమి మరియు దానికి సంబంధించిన దారి నీ కబ్జా చేసి న విషయం పై గ్రామస్తులంతా గురువారం సమస్య పరిష్కారం కోసం సాయంత్రం వారి తాండ పరిధిలోని హోటల్ వద్ద కూర్చుని మాట్లాడుతుండగా కోపోద్రికంతో సవాయిరం, మాలవత్ కిషోర్ వారి సంబంధించిన వ్యక్తులు కర్రలతో భగవత్ రంగి, బాదావత్ నీలాను, తలల పై కట్టెతో కొట్టగా రక్తగాయల అయినాయి, మెగావత్ సంఘ్యను మలవత్ సురేష్ కర్రతో కొట్టిన విషయంపై ఫిర్యాదు రాగా సవాయిరం మరియు కిషోర్ వారికి సంబంధించిన వారి పై కేసు నమోదు చేయడం జరిగింది. అని స్థానిక ఎస్సై పి.రాజశేఖర్ తెలపడం జరిగింది.

## జీలుగా విత్తనాల పంపిణీ



**బీబీపేట్ ప్రజా జ్యోతి మే 29** బీబీపేట మండల కేంద్రంలో రైతు వేదిక ప్రాంగణంలో వ్యవసాయ శాఖ, కో-ఆపరేటివ్ సహకార సంఘం ఆధ్వర్యంలో జీలుగా విత్తనాలను శుక్రవారం రోజున ఏవో నరేంద్ర, ఏ ఈ ఓ రాఘవేంద్ర, సొసైటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నరేంద్ర మాట్లాడుతూ ఇట్టి జీలుగును నాటిన భూమిలో సారావతాన్ని పెంపొందించమని రైతులకు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఏఓ నరేంద్ర, సొసైటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏ ఈ ఓ రాఘవేంద్ర, సి ఈ ఓ నర్సాగౌడ్, రైతులు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలని విఓఏల డిమాండ్



**ధర్పల్లి, మే 29 (ప్రజా జ్యోతి)** ఆరాకోర వేతనాలతో జీవనం సాగించడం కష్టంగా మారిందని పేర్కొంటూ ధర్పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట వివోఏలు శుక్రవారం ఐదవ రోజు కూడా సమ్మె కొనసాగించారు. ప్రస్తుత ధరల పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు చెల్లించలేక, నిత్యావసర సరుకులు కొనలేక, పిల్లలకు మెరుగైన విద్య అందించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ వేతనాలను పెంచి ఆదుకోవాలని కోరారు. వివోఏలను హెచ్ఆర్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, విధి నిర్వహణలో ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని ఐకేపీ వివోఏలు పాల్గొన్నారు.

## ఇందల్వాయి తాసిల్దార్ కార్యాలయంలో ఓటర్ జాబితా పై అత్యవసర సమావేశం



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) మే. 29** ఇందల్వాయి మండల కేంద్రంలో ఎమ్మార్వో బాలయ్య ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు ఓటర్ జాబితా ప్రత్యేక ఇంటెన్స్ రివిజన్ కార్యక్రమం సందర్భంగా ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ఈనెల.25.07.2026 నుండి 30.07.2026 వరకు బూత్ లెవెల్ అధికారులు బిఎల్ఓ లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ వివరాలు సేకరిస్తారని తెలిపారు ప్రతి ఓటర్ కు రెండు లీటర్స్ ఫారాలు అందజేయబడతాయని అందులో ఒక ఫారం ఓటర్ వద్ద ఉండగా మరో ఫామ్ బిఎల్ఓ లకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. అలాగే ఫామ్ 6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు ఫామ్ 8 ద్వారా ఒక పోలింగ్ కేంద్రం నుండి మరొక పోలింగ్ కేంద్రానికి మార్పులు చేసుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. హోటల్ జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి రాజకీయ పార్టీ నాయకులు పూర్తి సహకారం అందించాలని తమ తమ ప్రాంతాల్లో బిఎల్ఓ లకు సహకరించేలా కార్యకర్తలకు సూచనలు ఇవ్వాలని ఎమ్మార్వో బాలయ్య కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో ఆర్ఐ జి పి ఓ లు వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సైబర్‌క్రైమ్‌పైనేరాలమోసపూరి తనంపైపోలీసులుఅవగాహన.



కోటగిరి, మే 29, ప్రజా జ్యోతి. కోటగిరి మండల కేంద్రంలో నీ గ్రామంలో కోట గల్లి వద్ద ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాల మోసపూరితము పై ప్రజలకు అవగాహన శుక్రవారం కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలతో ఫోన్లో వచ్చిన ఓటీపీలను ఇలాంటి షేర్లను లింకు చేయవద్దని ఎవరైనా ఓటిపి అడిగితే చెప్పవద్దని జాగ్రత్తగా ఉండమని అవగాహన కల్పించారు పిల్లలను ఫోన్లో పై దృష్టి ఎక్కువగా ఉంటుంది కనుక వారు ద్వారా ఏదైనా ఓటిపి షేర్ లింక్ అయితే డబ్బులు పోతాయని వివరించారు. అలాగే పిల్లలకు బైక్లు ఇవ్వరాదని ఇచ్చినా గాని తప్పకుండా హెల్మెట్ ధరించుకోవాలని బండి కాగిత పత్రాలు కూడా దగ్గర ఉంచుకోవాలని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సంతోష్, సుధాకర్, పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ కు వాటర్ ప్యూరీఫైర్ అందచేత

**బీబీపేట్ ప్రజా జ్యోతి మే 29** బీబీపేట మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్ లో వాటర్ ప్యూరిఫైయర్ కావాలని మల్కాపూర్ గ్రామానికి చెందిన సిరిగాధ స్వామిని ఎస్ఐ కొండా విజయ్ అడిగిన వెంటనే దానశీల గుణవంతుడు సిరిగాద స్వామి స్పందించి ఇప్పించడం జరిగింది. అనంతరం ఎస్సై ఉండ విజయ్ సిరియాల స్వామికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఎస్సై విజయ్, మల్కాపూర్ సర్పంచ్ రామగళ్ళ నాగరాజు, సిరిగాధ స్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.,




## ఓటర్ల జాబితాల సవరణ పారదర్శకంగా నిర్వహించాలి




**కామారెడ్డి ప్రతినిధి మే 29. (ప్రజాజ్యోతి)** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక విస్తృత సవరణ ( స్పెషల్ ఇంటర్వ్యూ రివిజన్ - ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8ల వినియోగంపై అధికారులకు శిక్షణ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం-7 ద్వారా అర్హత లేని లేదా మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఫారం-8 ద్వారా ఓటర్ల వివరాలలో మార్పులు, సవరణలు చేపట్టే విధానాన్ని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , అదనపు కలెక్టర్ విక్టర్, మండలాల నుండి తహశీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఫారాలపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

## గుండెకల్లులో లక్ష్మీ షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**బిచ్కుంద (ప్రజా జ్యోతి ) 29** మే బిచ్కుంద మండలం గుండెకల్లు గ్రామ లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న లక్ష్మీ షాది ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను గ్రామ సర్పంచ్ రాజు పటేల్, ఉప సర్పంచ్ లాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సూచన మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఇది ఎంతో సహాయకారిగా ఉంటుందని సర్పంచ్ రాజు పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ పటేల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ ఆఫీసర్లు అనుమతి కోరిన రామవత్ మోహన్ నాయక్




**ఇందల్వాయి,( ప్రజా జ్యోతి) మే 29**: ఇందల్వాయి మండలంలో గత వర్షాకాలంలో తెగిపోయిన కుంటలు, చెరువుల కట్టలను పునర్నిర్మించుకునేందుకు రైతు కూలీలకు అడవి ప్రాంతాల నుండి మట్టిని తీసుకునే అనుమతి ఇవ్వాలని కోరుతూ ఏఐబి బిఎస్ జిల్లా అధ్యక్షులు రామావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు గురువారం ఇందల్వాయి రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రామావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ గత వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా మండలంలోని అనేక కుంటలు, చెరువుల కుంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కట్టల పునరుద్ధరణ అత్యవసరమైందన్నారు. రైతులు తమ ఖర్చులతోనే కట్టలను బాగుచేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు అవసరమైన మట్టిని సమీప అడవి ప్రాంతాల నుండి తీసుకునేందుకు ఫారెస్ట్ శాఖ ప్రత్యేక అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గాంధారిలో మండల ప్రత్యేక అధికారి డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి పర్యటన



**గాంధారి, మే 29 (ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి శుక్రవారం పర్యటించినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని బూర్గుల్ గ్రామంలో నర్సరీని పరిశీలించి అక్కడి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేఎస్‌జేబీ ఆన్‌లైన్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎస్‌బీఎం పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు ఎస్టిమేషన్ రూపొందించి ఐహెచ్‌హెచ్‌ఎల్ చెల్లింపులు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతిరోజూ లేబర్ టర్నోవర్ 150 మందికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ భాను, ఈసీ మధు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా

కామారెడ్డి ప్రతినిధి మే 29. (ప్రజాజ్యోతి) శుక్రవారం కామారెడ్డి పట్టణ కేంద్రంలోని వీక్లీ మార్కెట్ లక్ష్మమ్మ గుడి దగ్గరలో ఎన్నో రోజుల నుండి అనాధగా ఉంటున్న వృద్ధురాలు ముసలమ్మ చనిపోయిన విషయాన్ని చూసిన కాలనీవాసులు గమనించి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ కి సమాచారం ఇయ్యగా వెంటనే స్పందించి గడ్డం ఇందుప్రియ అక్కడికి చేరుకొని ప్రభుత్వ ఆసుపత్రి అధికారులకు, మరియు పోలీస్ సిబ్బందికి ఫోన్ చేసి మాట్లాడి వెంటనే తీసుకెళ్లి వెంటనే దీనికి సంబంధించిన కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు.ద



## బాలికల్లో నాయకత్వానికి 'స్నేహ సంఘాలు' బాట




గాంధారిలో సమీక్షా సమావేశం.. క్రీడల్లో ప్రతిభ చాటిన కిషోర్ బాలికలు

**గాంధారి, మే 29 (ప్రజాజ్యోతి)** కిషోర్ బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన 'స్నేహ సంఘాలు' మంచి ఫలితాలు ఇస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం గాంధారిలో నిర్వహించిన స్నేహ సంఘాల సమీక్షా సమావేశంలో బాలికలు చూపిన చురుకుదనం ఆకట్టుకుంది. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన ఈ సంఘాలు బాలికలకు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరచే వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు. బాల్య వివాహాల నిరోధం, విద్యపై అవగాహన, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాల్లో బాలికలు చైతన్యవంతంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సమీక్షలో బాలికల సమూహ సమన్వయం, బాధ్యతాయుత ప్రవర్తన, సమావేశాల నిర్వహణ, సమస్యల పరిష్కారంలో చూపిన ధైర్యసాహసాలను అధికారులు అభినందించారు. విద్య, వ్యక్తిత్వ వికాసం అంశాల్లోనూ వారు మెరుగైన అవగాహన ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సహస్ర (గాంధారి) ప్రథమ స్థానం, నిహారిక ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు అధికారులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రసన్న కుమార్, గ్రామ సంఘం అధ్యక్షురాలు కళావతి, సీసీలు రాములు, సౌజన్య, సీఏలు స్వప్న, లక్ష్మీదేవి, లావణ్య, వనిత, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## గాంధారి మండలంలో మూడు పాఠశాలలకు ప్రీ ప్రైమరీ తరగతులు

### నాలుగేళ్ల చిన్నారులకు ప్రవేశాలు ప్రారంభం

**గాంధారి, మే 29 (ప్రజాజ్యోతి)**దగాంధారి మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్వ ప్రాథమిక తరగతులు మంజూరైనట్లు మండల విద్యాధికారి శ్రీహరి తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాల జువ్వాడి, ప్రాథమిక పాఠశాల పోతంగల్ కలాన్, ప్రాథమిక పాఠశాల గౌరారం పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. నాలుగేళ్ల వయస్సు నిండిన చిన్నారులను ఈ తరగతుల్లో చేర్పించుకోవచ్చని తెలిపారు. అలాగే గాంధారి ప్రాథమిక బాలికల పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల వంద్రికల్‌లో కూడా ప్రవేశాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు చిన్నారుల సమగ్ర వికాసానికి అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీహరి సూచించారు.



# కామారెడ్డి పాత బస్టాండ్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**సైబర్ నేరాలు, దొంగతనాల నివారణ, హెల్మెట్ వినియోగం, మహిళల భద్రతపై ప్రజలకు చైతన్యం**



**కామారెడ్డి రూరల్ మే 29 ప్రజా జ్యోతి** కామారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంగణంలో గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గౌరవనీయులు కామారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు ప్రజలకు పాటలు, సందేశాలు, సంభాషణల ద్వారా పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరుగుతున్న వేధింపులు వంటి సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజలు ఇళ్లను ఖాళీగా ఉంచి బయటకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి తలుపులు బలంగా మూసివేయడం, పరిసర ప్రాంతాలపై నిఘా ఉంచడం, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి సూచనలు చేశారు.

సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్ నంబర్లు, వ్యక్తిగత సమాచారం ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దని, సోషల్ మీడియా ద్వారా వచ్చే మోసపూరిత సందేశాలపై జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళల భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, మహిళలకు రక్షణగా షీ టీమ్ నిరంతరం సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. షీ టీమ్ టోల్ ఫ్రీ నంబర్ 8712686094 ను ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 కు కాల్ చేసి పోలీస్ సహాయం పొందవచ్చని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత తమ ప్రాణ భద్రత కోసం హెల్మెట్‌ను అలవాటు చేసుకోవాలని సూచించారు. వేసవి సెలవుల సందర్భంగా చిన్నపిల్లలు చెరువులు, కుంటలు, కాలువలు, ఈత ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. నీటి ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లనివ్వకూడదని, ప్రమాదాల నివారణలో కుటుంబ సభ్యులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, పోలీస్ కానిస్టేబుల్స్ ప్రభాకర్, సాయిలు ప్రజలకు వినోదాత్మకంగా పాటలు, నాటికలు, సందేశాల ద్వారా అవగాహన కల్పించారు. వారి ప్రదర్శనలు బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులను ఆకట్టుకున్నాయి. ప్రజలు కూడా ఆసక్తిగా కార్యక్రమాన్ని వీక్షించి పోలీసుల సూచనలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి షీ టీమ్ సభ్యులు డబ్ల్యూపీసీ సౌజన్య, పీసీ భూమయ్య పాల్గొని మహిళలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, స్థానిక ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీస్ శాఖ అధికారులు తెలిపారు.

# ఐకెపి వివోఏ ల నిరవధిక సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ మద్దతు



**రుద్రూర్, మే 29(ప్రజా జ్యోతి) :** రుద్రూర్ మండల కేంద్రంలోని మండల సమీకృత కార్యాలయం ఎదుట ఐకెపి వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరుకుంది. సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేణులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివోఏలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని,పని భారం తగ్గించాలని,అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే జీఓ 58ను సవరించి,వివోఏలకు రూ.20 లక్షల వరకు సాధారణ మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ సమ్మెలో అధ్యక్షురాలు జరిన, ఉపాధ్యక్షురాలు జిజియా భాయ్, కార్యదర్శి జి.స్వరూప,సహాయ కార్యదర్శి నాగరాణి,కోశాధికారి లావణ్య,బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు,నాయకులు కొత్తపల్లి రవి కిరణ్,శివ కుమార్, సాయి కుమార్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం.



**రెంజల్, మే 29(ప్రజాజ్యోతి ):** రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో సర్పంచ్ లచ్చావార్ సుహాసిని నితిన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుహాసిని నితిన్ మాట్లాడుతూ గ్రామంలో గల సమస్యలు వాటి పరిష్కారానికై చర్చించడం జరిగిందని అలాగే వేసవికాలం దృష్ట్యా గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా వార్డు మెంబర్స్ తమ, తమ కాలనీలలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి మెహబూబ్ అలీ, ఉపసర్పంచ్ ఏకార్ పాషా, వార్డు మెంబెర్స్ లచ్చావార్ నితిన్,దండు విజయ, దెబ్బడ రాజు, సాబీత్, సాయిద్, గోసం గంగాధర్, అశోక్,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్యాసంపల్లి తండాలో ఘనంగా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం

**అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రసన్న, అక్షరాభ్యాస వేడుకలు**
**చిన్నారుల ఆరోగ్యం -- విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు**





**కామారెడ్డి రూరల్ , మే 29 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈ రోజు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలకు గ్రామ ప్రజలు, తల్లులు, బాలింతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రత్యేక అలంకరణలు చేసి కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సంప్రదాయ పద్ధతిలో అన్నప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో చిన్నారులకు తొలి అన్నం తినిపించి ఆశీర్వదించారు. అనంతరం విద్యారంభానికి ప్రతీకగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నారులతో తొలి అక్షరాలు రాయించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాభ్యాసం మంచి భవిష్యత్తును అందిస్తుందని భావించి ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యం మరియు విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రాథమిక విద్య అందించడం జరుగుతోందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి తల్లి, బాలింత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిన్నారుల తొలి ఐదేళ్ల ఎదుగుదల అత్యంత కీలకమని, ఈ దశలో సరైన పోషకాహారం మరియు ఆరోగ్య సంరక్షణ అవసరమని ఆయన అన్నారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తల్లిదండ్రులు విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామంలో చిన్నారుల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు బాలల అభివృద్ధికి ముఖ్య కేంద్రాలుగా మారాయని అన్నారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను గ్రామ ప్రజలు




పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. టీచర్ సుకన్య మాట్లాడుతూ చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయమ్మలు చిన్నారులకు పోషకాహారం అందిస్తూ తల్లులకు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ నాగరాణి, టీచర్ సుకన్య, ఆయమ్మలు, గ్రామ పెద్దలు, మహిళలు, తల్లులు, బాలింతలు, చిన్నారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.

# తక్షణమే ఎస్సార్ ఎస్పి నుండి కాకతీయ కాలువకు లీకేజ్ వాటర్ విడుదల చేయాలి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**ప్రజా జ్యోతి,బాల్కొండ మే 29:** బాల్కొండ నియోజకవర్గంలోని కాకతీయ కాలువ వెంబడి ఉన్న గ్రామాల రైతులు పసుపు పంట సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎస్ ఆర్ ఎస్ పి నుండి కాకతీయ కాలువకు వెంటనే లీకేజ్ నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఏడాది పొడవునా కాకతీయ కాలువలో నీరు నిల్వ ఉండేదని, దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు చేసుకునేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాలువలో పూర్తిగా నీరు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ లో ప్రస్తుతం తగినంత నీటి నిల్వలు ఉన్నందున, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని లీకేజీ వాటర్ ద్వారా కాకతీయ కాలువకు నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పసుపు పంట సాగుకు ఇది కీలక సమయమని, ప్రభుత్వం మరియు సాగునీటి శాఖ అధికారులు వెంటనే స్పందించి లీకేజ్ వాటర్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కోటగిరి మండల కేంద్రంలోని మహిళా సంఘాల వివో ఏలకు బి.ఆర్.ఎస్ మద్దతు.



**కోటగిరి,మే29,ప్రజాజ్యోతి.** కోటగిరి మండల కేంద్రంలో దీక్షలు చేపడుతున్న ఐకెపి వివో ఏ లకు బి.ఆర్.ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది బి ఆర్ ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో దీక్ష శిబిరాన్ని సందర్శించి దీక్షల్లో కూర్చోవడం జరిగింది వివో ఏళ్లతో సమస్యలపై చర్చించడం జరిగింది గతంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే సీతక్క వివోఏలకు కనీసం 28 వేల రూపాయల నెలసరి వేతనం ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి అని హెచ్ఆర్ పాలసీ వర్తింపచేయాలి అని బీమా సౌకర్యం కల్పించాలి అని అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి అని అసెంబ్లీలో డిమాండ్ చేయడం జరిగింది నేడు అదే శాఖకు మంత్రిగా కొనసాగుతున్న సీతక్క తక్షణమే ఐకెపి వివో ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి అని బి ఆర్ ఎస్ కోటగిరి మండల నాయకులు తెల్ల రవికుమార్ డిమాండ్ చేశారు అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు తక్షణమే వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు రాబోయే రోజులలో ప్రభుత్వ ఉద్యోగులంతా రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు అధికారంలోకి వచ్చేందుకు ఉద్యోగులకు యువకులకు మహిళలకు అన్ని వర్గాల ప్రజలకు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇవ్వడం జరిగింది అని మండిపడ్డారు తక్షణమే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి అని డిమాండ్ చేశారు విఏఓలతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలి అని లేనట్లయితే వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్, సమీర్, నజీర్, కప్ప సంతోష్ ,శంకర్ గౌడ్ ,బేగారి మారుతి, ఉమాకాంత్ ,యోగేష్, దత్తు, మసూద్, వజాద్ రహీం, మేత్రి గంగాధర్, శివ, బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు వివో ఎల ఉద్యోగ సంఘం నాయకులు మండలంలోని వివిధ గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం.



**(ప్రజాజ్యోతి - నందిపేట్)** నందిపేట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ డిప్లొమా ప్రవేశాల కోసం మొదటి విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రాజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు ముందుగా ఖి+ూూశ్రజజు వెబ్‌సైట్‌రి(ష్ట్రజూం:\/\/ప్రజూశీశ్రీఎఎవ్.అఅఎ.అఅ లో మే 31 వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్ ప్రకారం రెండు సెట్ల జిరాక్స్ కాపీలు మరియు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని వివరించారు. కళాశాలలో మెకానికల్, ఈసీఈ, సీఎస్ఈ డిప్లొమా కోర్సుల్లో ఒక్కో బ్రాంచ్‌లో 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు, స్వయం ఉపాధి, ఉన్నత విద్య అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పాలీసెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఐదవ రోజుకు చేరిన వివో ఎలా ధర్నా మద్దతు తెలిపిన బి ఆర్ ఎస్ నాయకులు

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి )మే 29** ఆరాకోర వేతనాలతో జీవనం సాగించడం కష్టంగా మారిందని పేర్కొంటూ ఇందల్వాయి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట విఓఏలు శుక్రవారం ఐదవ రోజు కు చేరిన సమ్మె వీరికి మద్దతుగా బి ఆర్ ఎస్ నాయకులు అనంతరం రాష్ట్ర నాయకులు పాశంకుమార్ మాట్లాడుతూ వివో ఏళ్లకు తగిన వేతనం ఇచ్చి వారిని ఆదుకోవాలని. రాష్ట్ర నాయకులు అన్నారు చాలీచాలని జీతాలతో ఉద్యోగం చేస్తున్న వీరికి ప్రభుత్వం అండదండలు కచ్చితంగా ఉండాలని కుమార్ అన్నారు కనీస వేతనం 26,000 ప్రకటించాలని జీవిత బీమా వర్తింపచేయాలని 58 జీవోను రద్దు చేయాలని కుమార్ అన్నారు ప్రస్తుత ధరల పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు చెల్లించలేక, నిత్యావసర సరుకులు కొనలేక, పిల్లలకు మెరుగైన విద్య అందించలేక ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీరికి ప్రభుత్వం వెంటనే స్పందించి వివో ఎలా వేతనాలను పెంచి ఆదుకోవాలని కోరారు. అనంతరం బిఓఎల్ అధ్యక్షురాలు సరళమాట్లాడుతూ విఓఏలను హెచ్ఆర్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, విధి నిర్వహణలో ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ సుధాకర్ మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి మాజీ ఎంపిటిసి చింతల దాస్. గన్నారం అంబేద్కర్ అధ్యక్షులు మహేష్


బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# విత్తన వ్యాపారులు నాణ్యమైన విత్తనాలు విక్రయించండి

రైతులు లైసెన్స్ కలిగిన వ్యాపారుల వద్ద విత్తనాలు కొనాలి
రైతుల నుండిఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
డీలర్లకు వ్యవసాయ అధికారి వైష్ణవ్ సూచన.



**ప్రజా జ్యోతి,ఏర్గట్ల, మే 29**:రాబోయే రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మండలంలోని రైతువేదిక లో విత్తన, పురుగుమందు డీలర్లతో మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా రైతులకి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం సూచిస్తున్న వరి రకాలను రైతులకి అందుబాటులో ఉంచాలని, ప్రతి రైతుకి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించడం జరిగింది. ఏ విషయంలోఅయినా రైతుల నుండి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తన వ్యాపారులవద్దనే విత్తనాలు తీసుకోవాలని వేరే ఎవరైనా విత్తనాలు అమ్మితే వారిపైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ,మండల డీలర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని విఓఏల డిమాండ్

ఐదో రోజూ కొనసాగిన సమ్మె
ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం”



**ప్రజా జ్యోతి,ఏర్గట్ల, మే 29:** తెలంగాణ ఐకెపి వివోఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ (స్వతంత్ర యూనియన్) ఆధ్వర్యంలో ఏర్గట్ల మండల సమాఖ్య కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న విఓఏల సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విఓఏలు నిరసన కార్యక్రమాలను కొనసాగించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే విఓఏలకు కనీస వేతనంగా రూ.26 వేలు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు సమస్యల పరిష్కారంపై స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతిపక్షంలో ఉన్న సమయంలో విఓఏల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన నాయకులు, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ వాటి పరిష్కారంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గ్రామీణ మహిళా సంఘాలను బలోపేతం చేసే బాధ్యతలను నిర్వర్తిస్తున్న విఓఏల సేవలను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. రోజురోజుకూ పనిభారం పెరుగుతున్నప్పటికీ వేతనాలు మాత్రం పెరగడం లేదని, జీవో పేరుతో గ్రామ సంఘాల నిధుల నుంచే వేతనాలు తీసుకోవాలని సూచించడం సరైన విధానం కాదన్నారు. తమకు నేరుగా సెర్ప్ ద్వారా గౌరవప్రదమైన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వివోఏల ప్రధాన డిమాండ్లు
- కనీస వేతనంగా రూ.26 వేల అమలు
- సెర్ప్ ఉద్యోగులుగా గుర్తింపు
- హెచ్ఆర్ పాలసీ అమలు
- అర్హులైన వారికి సీసీల్ పదోన్నతులు
- రూ.20 లక్షల బీమా సౌకర్యం
- ట్యాబ్‌లు, ఇంటర్నెట్ సదుపాయం
- 58 జీవో సవరణతో జాబ్ చార్ట్ విడుదల

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 18 వేల మంది విఓఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండలానికి చెందిన విఓఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఎవరెస్టు దినోత్సవం

ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన– మలావత్ పూర్ణ



సిరికొండ( ప్రజా జ్యోతి)మే 29 సిరికొండ మండల కేంద్రంలోని మారుమూల ప్రాంతమైన పాకాల గ్రామానికి చెందిన మాలావత్ పూర్ణ. అతిపిన్న వయసులో ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ ప్రపంచ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే ఆమె కిలిమంజోరా, ఎలా బ్రోస్, పర్వతాలను అధిరోహించి ఎందరికో ఆదర్శంగా నిలిచింది మాలవత్ పూర్ణ ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఈరోజు భారతదేశంలో నేటి మహిళలకు ఆమె ఆదర్శమని మండల ప్రజలు తెలియజేశారు

# ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు..

**కోటగిరి, మే 29, ప్రజాజ్యోతి.** బోధన్ పట్టణ కేంద్రంలో ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలను ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట ఏర్పాటు చేశారు. స్నేహ శ్రీయ మొబైల్ లేబలేటరి సర్వీస్ ద్వారా జీవనశైలి వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు రక్తపోటు, షుగర్, కొలస్ట్రాల్, క్రియాటినిస్, యూరిన్ షుగర్, యూరిన్ అల్బుమిన్, హెచ్ బి ఏజీ పరీక్షలను ఉచితంగా చేశారు. 120 మందికి వైద్య పరీక్షలనుముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు... బోధన్ : బోధన్ పట్టణ కేంద్రంలో ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలను ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట ఏర్పాటు చేశారు. స్నేహ శ్రీయ మొబైల్ లేబలేటరి సర్వీస్ ద్వారా జీవనశైలి వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు రక్తపోటు, షుగర్, కొలస్ట్రాల్, క్రియాటినిస్, యూరిన్ షుగర్, యూరిన్ అల్బుమిన్, హెచ్ బి ఏజీ పరీక్షలను ఉచితంగా చేశారు. 120 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ రీజినల్ మేనేజర్ మహేష్ బాబు, మార్కెటింగ్ మేనేజర్ రఘు, క్లస్టర్ ఇంచార్జీ షాదుల్, బోధన్ బ్రాంచ్ మేనేజర్ నవీన్ తదితరులు ఉన్నారు. నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ రీజినల్ మేనేజర్ మహేష్


బాబు, మార్కెటింగ్ మేనేజర్ రఘు, క్లస్టర్ ఇంచార్జీ షాదుల్, బోధన్ బ్రాంచ్ మేనేజర్ నవీన్ తదితరులు ఉన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వ విస్తరణకు బోధన్ ఆర్డీఓ మేడమ్ సానుకూల స్పందన...





**ప్రజా జ్యోతి బోధన్ మే. 29..** బోధన్ పట్టణంలోఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ విస్తరణ కార్యక్రమంలో భాగంగా బోధన్ డివిజన్ ఆర్డీఓ శ్రీమతి విజయకుమారి గారిని మర్యాదపూర్వకంగా కలిసి రెడ్ క్రాస్ సభ్యత్వ ప్రోత్సాహంపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలు, సభ్యత్వం ప్రాధాన్యత గురించి వివరించగా, ఆర్డీఓ మేడమ్ సానుకూలంగా స్పందిస్తూ తమ కార్యాలయ సిబ్బంది మాత్రమే కాకుండా ఇతర ప్రభుత్వ అధికారులతో కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతామని హామీ ఇచ్చారు.అలాగే తదుపరి బోధన్ ఎం.ఆర్.ఓ విట్టల్ గారు కూడా సానుకూలంగా స్పందించి రెడ్ క్రాస్ సభ్యత్వ విస్తరణ ద్వారా మరింత సేవా కార్యక్రమాలు ప్రజలకు చేరువ అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు గారు, బోధన్ డివిజన్ చైర్మన్ బసవేశ్వర్ రావు గారు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్ గారు, మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రావు ,బోధన్ మండల చైర్మన్ కొడాలి కిషోర్ గారు, గారు తదితరులు పాల్గొన్నారు.

# చిరుత పులి దాడిలో మేక మృతి



**సిరికొండ( ప్రజా జ్యోతి) మే 29** సిరికొండ మండలం కమ్మర్ పల్లి రేంజ్ సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం చిత్తపురి దాడిలో మేక మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది తాటిపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన మాలావత్ రాజుకు చెందిన మేకపై చిరుత పులి దాడి చేసి హతమార్చిందని మాలవత్ రాజు జీవనోపాధి కోసం ప్రధానంగా మేకల పెంపకం పైనే ఆధారపడి జీవిస్తున్నారని ఈ ఘటనతో ఆయనకు సుమారు 15 వేల రూపాయల నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు బాధితుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అటవీ శాఖ అధికారులు తగిన నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు ఎఫ్ ఆర్ వో వివరణ ఈ ఘటనపై అటవీ శాఖ అధికారుల స్పందన కోరగా. ఎఫ్ ఆర్ వో కె. నర్సింగరావు మాట్లాడుతూ అడవిలో మేత కోసం మేకలను ప్రవేశపెట్టడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు అడవిలోకి మేత కోసం వెళ్ళిన మేక చిరుత దాడికి మృతి చెందిన నేపథ్యంలో ప్రభుత్వం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం మేకలకు నష్టపరిహారం అందించే అవకాశం లేదని వివరించారు. అయితే ఇతర అర్హత కలిగిన సందర్భంలో నిబంధన మేరకు నష్టపరిహారం అందించే అవకాశం ఉందని తెలిపారు

# అక్రమ ఇసుక విక్రయం పై సర్పంచ్ ఆగ్రహం

## ఇందిరమ్మ ఇళ్లకు అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నారని తహసీల్దార్‌కు తాళ్ల రాంపూర్ సర్పంచ్ పావని ఫిర్యాదు

**ప్రజాజ్యోతి, ఏర్గట్ల, మే 29:** మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇసుకను కొందరు వ్యక్తులు అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తూ పేదలపై ఆర్థిక భారం మోపుతున్నారని గ్రామ సర్పంచ్ బెజ్జారపు పావని భాను ప్రకాష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బాధిత లబ్ధిదారుల తరపున మండల తహసీల్దార్ మల్లయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు బదులుగా అధిక మొత్తం వసూలు చేస్తూ కొందరు ఇసుకను వ్యాపారంగా మార్చుకున్నారని ఆరోపించారు. పేదల సొంతింటి కలను ఆసరాగా చేసుకుని అక్రమంగా డబ్బులు దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ బాధ్యత అని తెలిపారు. గ్రామ ప్రజల కష్టార్జిత సొమ్మును దోచుకునే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించవద్దని లబ్ధిదారులకు సూచించారు.ఎవరైనా అధిక ధరలు డిమాండ్ చేస్తే వెంటనే గ్రామ పంచాయతీ లేదా అధికారుల



దృష్టికి తీసుకురావాలని కోరారు. అక్రమ ఇసుక విక్రయాలను అరికట్టేందుకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, పేదలకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.

# ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చినా ప్రభుత్వం పట్టించుకోదా?

సమ్మెలో మహిళ ఉద్యోగి స్పృహ తప్పడంతో కలకలం

వివోఏల ఆవేదన

ఐదవ రోజుకు చేరిన వివోఏల సమ్మె

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై ఆగ్రహం?

తక్షణమే తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ అల్టిమేటశీ




**సిరికొండ( ప్రజా జ్యోతి )మే 29** మండలంలో వీఓఏల సమస్యలు రోజురోజుకూ విషమిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. తమ డిమాండ్ల పరిష్కారం కోసం రోజుల తరబడి నిరసనలు కొనసాగిస్తున్న వీఓఏలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
నిరవధిక సమ్మెలో భాగంగా చేపట్టిన ఆందోళనలో ఓ మహిళా వీఓఏ అస్వస్థతకు గురై కుప్పకూలడం అక్కడ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసి కలకలం సృష్టించింది.
సహచర మహిళలు నీళ్లు పట్టించి, ఓదార్చే ప్రయత్నం చేసిన దృశ్యాలు అక్కడున్న వారిని కలచివేశాయి. "ఇంకెంతకాలం మా బాధలు పట్టించుకోరా... మా ప్రాణాలు పోయిన తర్వాతే స్పందిస్తారా?" అంటూ వీఓఏలు ఆవేదన వ్యక్తం చేశారు.
కుటుంబాలను పోషిస్తూ ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న తమకు కనీస భద్రత, జీతభత్యాలు, ఉద్యోగ హామీ కూడా లేకపోవడం దురదృష్టకరమని వాపోయారు.
వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు. మహిళా సిబ్బంది ఆరోగ్యం క్షీణించేంత వరకు పరిస్థితి వెళ్లినా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ప్రజాసంఘాలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
ఈ ఘటనతో వీఓఏల సమస్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారి డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

# వర్షాలు కురుస్తున్నా తగ్గని భానుడి ప్రతాపం

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. అయితే ఒకవైపు అకాల వర్షాల కారణంగా వడదెబ్బ మరణాలు చాలా వరకు తగ్గడం ఊరట కలిగిస్తోంది. వర్షాలు కురుస్తున్నప్పటికీ, మరోవైపు భానుడి ప్రతాపంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నేడు (శుక్రవారం), శనివారాల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం నాడు ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. శనివారం నాడు ఈ జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ వడగాలులు తీవ్రంగా వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.తీవ్రమైన ఎండల సమయంలోనే రాష్ట్రంలో వర్ష సూచన ఉంది. శుక్ర, శనివారాల్లో ఉత్తర తెలంగాణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. దీంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. వచ్చే నెల మూడో తేదీ వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో నైరుతి రుతుపవనాల్లో కదలికలు ప్రారంభమయ్యాయని, బంగాళాఖాతంలో ఇవి పైకి కదిలేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఎఓఆ వెల్లడించింది.

### 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. వడదెబ్బకు ఏడుగురు మృతి

గురువారం తెలంగాణ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఎండలు దంచికొట్టాయి. బుధవారం వాతావరణం కొంత చల్లగా అయినట్లు అనిపించినా, గురువారం నాటికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దాదాపు 12 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటేశాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, నిర్మల్, పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, సూర్యాపేట జిల్లాల్లో 46 డిగ్రీలకు



పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కాగా, రాష్ట్రంలో పెరిగిన ఈ వడదెబ్బ కారణంగా గురువారం ఒక్కరోజే 7 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు చనిపోగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నలుగురు వడదెబ్బకు గురై మృతి చెందారు.

### వడగాల్పుల తీవ్రత.. 79 మండలాల్లో హెచ్చరికలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత ఆందోళనకరంగా మారుతోంది. శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 79 మండలాల్లో తీవ్రమైన వడగాలులు, మరో 152 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని అధికారులు తెలిపారు. అలాగే శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

### ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు

ప్రస్తుతం జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ఒక ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఎండలతో పాటు అకాల వర్షాలు కూడా కురిసే అవకాశం ఉంది. మే 29 నాడు మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. వీటితో పాటు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

## మొరం ట్రాక్టర్ బోల్తా డ్రైవర్ కు గాయాలు



**ప్రజాజ్యోతి,ఏర్గట్ల, మే 29**: బట్టాపూర్ నుండి వెలగటూర్ గ్రామానికి మొరం లోడుతో వెళ్ళుచున్న ట్రాక్టర్ నెంబర్ ు+ 16 జ 6206 బట్టాపూర్ గ్రామ బ్రిడ్జి వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురై బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రైలర్ బ్రిడ్జి పై ఉండగా ఇంజన్ బ్రిడ్జ్ కిందకు వేలాడింది. ట్రాక్టర్ పైనుండి డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకొని దూకడంతోగాయాలయ్యాయి. గాయపడ్డ తర్ల పాడు గ్రామానికి చెందిన డ్రైవర్ శేఖర్ చేయి విరగడంతో చికిత్స కొరకు నిర్మల్ పట్టణానికి తరలించారు.

## నిజాం షుగర్ ఫ్యాక్టరీ కై పోరాడిన నాయకులపై కేసు కొట్టివేత...



**ప్రజా జ్యోతి.బోధన్ మే 29** : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నాటి పాలకులు ఇచ్చిన హామీ ప్రకారం బోధన్ లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించాలని నిజాం సుగర్ రక్షణ కమిటీ, తెలంగాణ సామాజిక పార్టీ ఆధ్వర్యంలో 2018లో రిలే నిరాహార దీక్షలు అమర నిరాహార దీక్షలు చేపట్టిన బీర్కూర్ శంకర్, మల్లేష్, పుట్ట వరదయ్య, రాఘవులు, గుమ్ముల గంగాధర్, జంభిశెట్టి శంకర్, యేశాల గంగాధర్, సుల్తాన్ సాయిలు, రాములు యాదవ్, గోపి, షేక్ బాబు, షేక్ ఫారుక్ తదితర నాయకులపై కేసులను పెట్టారు. అట్టి కేసు విషయములో కోర్టు చుట్టూరా 8 సంవత్సరాలుగా తిరుగుతున్న నాయకులపై పెట్టిన కేసులో సాక్షాదారాలను ప్రవేశపెట్టనందున విచారించిన న్యాయమూర్తి ఫ్యాక్టరీకై పోరాడిన నాయకులు నిర్దోషులని శుక్రవారం తీర్పు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై జరిగిన మలిదశ ఉద్యమంలో రాష్ట్రం ఏర్పడితే బోధన్ ప్రాంతంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపిస్తామని వాగ్దానం చేసి, రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన నాటి టిఆర్ఎస్ పార్టీ నడిచే ఫ్యాక్టరీని బంద్ చేసి ఈ ప్రాంత ప్రజలను మోసం చేసింది. అయితే 2018లో అసెంబ్లీకి జరిగే ఎన్నికలు నిజాం షుగర్ రక్షణ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు తెలంగాణ దీక్షస్థల్ లో సుమారు 200 రోజులు జరిగాయి.

## నేరాల నివారణలో భాగంగా ఇందల్వాయ ఇందల్వాయిలో ఫుట్ ప్యాట్రోలింగ్




**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) మే.** 29 ఇందల్వాయి మండల కేంద్రంలోని నిర్వహించిన పోలీసులు ప్రజల భద్రత మరియు నేరాల నివారణ లక్ష్యంగా ఇందల్వాయి కమాన్ ప్రాంతంలో పోలీసులు ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూ సీఐ వినోద్ ,ఎస్ఐ సందీప్, హెచ్‌సీ కిరణ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## సిరికొండ మహిళా సంఘాలకు రూ. 7.73 కోట్ల రుణాలు

**సిరికొండ( ప్రజా జ్యోతి) మే 29** సిరికొండ మండల కేంద్రంలో మండల సమైక్య భవనం వద్ద ప్రజాపలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్ ద్వారా రూ. 7.73 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు తహసిల్దార్ రవీందర్ రావు, ఏటీఎం సువర్ణ తెలిపారు మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు సీసీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు



## బిజినెస్

# రిలయన్స్ ఫౌండేషన్ సేవ.. కోట్లాది జీవితాల్లో మార్పు!



నీతా అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఫౌండేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=) ఖర్చులను గణనీయంగా పెంచింది. సామజిక కార్యక్రమాల కోసం ఏకంగా రూ.2248 కోట్లు ఖర్చు చేసింది. ఇది గత సంవత్సరం (రూ.2156 కోట్లు)తో పోలిస్తే సుమారు రూ.100 కోట్లు ఎక్కువ. కోవిడ్ తర్వాత కాలం నుంచి ఇప్పటివరకు రిలయన్స్ ఫౌండేషన్ మొత్తం సీఎస్ఆర్ ఖర్చు రూ.9,500 కోట్లు దాటింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 9.7 కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం చేకూరింది. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ జీవనంలో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదాహరణకు.. గ్రామీణ ప్రాంతాల్లోని ఒక డెయిరీ రైతు ఆదాయం గణనీయంగా పెరిగి రెండింతలయింది. అంతే కాకుండా.. విద్యార్థుల భవిష్యత్ కోసం స్కాలర్‌షిప్ సదుపాయాలను అందిస్తున్నారు. 2020-21లో ప్రారంభమైన రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ కార్యక్రమం ప్రతి సంవత్సరం సుమారు 5,100 మంది విద్యార్థులకు ఉపయోగపడుతోంది. వీరిలో చాలామంది మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందారు. వారి కుటుంబాల ఆర్థిక స్థితిలో పురోగతికి సహాయపడుతున్నారు. ఇది సమాజంలో దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడే ముఖ్యమైన అంశంగా నిపుణులు చెబుతున్నారు. మహిళా సాధికారత విషయంలో కూడా స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. డిజిటల్ లిటరసీ, ఆర్థిక అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళల్లో 75% మందికి ఆర్థిక నిర్ణయాలపై విశ్వాసం పెరిగింది. సగం మంది కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో మరింతగా పాల్గొంటున్నారు. జంతు సంరక్షణ రంగంలో వంతారా ద్వారా ఇప్పటివరకు 1.5 లక్షలకు పైగా జంతువులకు సంరక్షణ అందించారు. దీనికిగాను అనంత్ అంబానీకి 2025లో గ్లోబల్ హ్యూమానిటేరియన్ అవార్డు లభించింది. నీతా అంబానీకి కూడా అంతర్జాతీయ స్థాయిలో హ్యూమానిటేరియన్ అవార్డులు వచ్చాయి. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పాడి రైతుల రోజువారీ పాలు ఉత్పత్తి 6.14 లీటర్ల నుంచి 10.37 లీటర్లకు పెరిగింది. వారి వార్షిక ఆదాయం సుమారు 64.6% పెరిగింది. మొత్తం కుటుంబ ఆదాయం కూడా సుమారు 56% వరకు పెరిగింది. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఫౌండేషన్ సేవలు అందించింది. ఆంధ్రప్రదేశ్ తీరంలో వచ్చిన తుపాను హెచ్చరికల సమయంలో ముందస్తు సమాచారం ఇచ్చి మత్స్యకారులు, రైతులను అప్రమత్తం చేసింది. ఈ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు కూడా లభించింది. ఇలా రిలయన్స్ ఫౌండేషన్ సామజిక కార్యక్రమాల కోసం ప్రతి ఏటా భారీ మొత్తంలో ఖర్చు చేస్తోంది.

# భారతీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనం..

## 1100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. రూ.5 లక్షల కోట్లు నష్టం




భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన ట్రేడింగ్ చివరికి అమ్మకాల ఒత్తిడి కారణంగా భారీనష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,092.06 పాయింట్లు (1.44 శాతం) నష్టపోయి 74,775.74 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 76,220.02 పాయింట్ల గరిష్టాన్ని తాకినప్పటికీ చివరికి నష్టాల్లో ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 359.40 పాయింట్లు (1.50 శాతం) నష్టపోయి 23,547.75 వద్ద ముగిసింది. దేశంలో ఇన్వెస్టర్ల సంపద ఈ ఒక్కరోజే దాదాపు రూ.5 లక్షల కోట్లు నష్టపోయింది. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.466 లక్షల కోట్లుగా ఉంది. దేశంలో రుతుపవనాల రాక ఆలస్యం కానుందనే వార్తలు, అమెరికా--ఇరాన్ మధ్య శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు. దేశంలో రుతపవనాలు ఆలస్యమైతే వర్షాలు సరిగ్గా కురవవు. దీనివల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం మార్కెట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభాలు చవిచూడగా, మిగతా షేర్లు భారీగా నష్టపోయాయి. వాటిలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ఎక్కువగా నష్టాలు చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 95.05గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల ధర 91.40 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4530 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# రూ.1.4 కోట్ల బిల్లు కస్టమర్లకు వాపస్!



వ్యాపారంలో లాభాల కంటే వినియోగదారుల నమ్మకమే ముఖ్యమని బార్బెక్యూ రెస్టారెంట్ తెలిపింది. తాము అందించిన ఆహారం సొంత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గ్రహించిన సదరు యాజమాన్యం.. ఏకంగా కస్టమర్లకు సుమారు రూ.1.4 కోట్లు (1,62,000 అమెరికన్ డాలర్లు / 1.1 మిలియన్ యువాన్లు) తిరిగి చెల్లించింది. కస్టమర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకపోయినా సంస్థే స్వయంగా ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుంది. 'ది సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' నివేదిక ప్రకారం.. చైనావ్యాప్తంగా 142 అవుట్‌లెట్లతో విస్తరించిన ప్రసిద్ధ బ్రాండ్ 'వెరీ లాంగ్ అగో లాంబ్ స్కేవర్స్' ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

**అసలేం జరిగింది? గ్రిల్లింగ్‌లో లోపమే కారణమా?**

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కంపెనీకి చెందిన 24 అవుట్‌లెట్లలో దాదాపు 48,000 టేబుల్స్ వద్ద భోజనం చేసిన కస్టమర్లను రెస్టారెంట్ యాజమాన్యం ఈ నెల ప్రారంభంలో స్వయంగా సంప్రదించింది. అంతర్గత నాణ్యత సమీక్షలో ఒక షాకింగ్ నిజం బయటపడటమే దీనికి కారణం. ఆ సమయంలో కొత్తగా ప్రవేశపెట్టిన గ్రిల్లింగ్ పరికరాల్లో ఉష్ణోగ్రత స్థిరంగా లేకపోవడం వల్ల, మటన్ కబాబ్‌లు ఆశించిన స్థాయిలో గ్రిల్ కాలేదని కంపెనీ గుర్తించింది. కస్టమర్ల నుంచి అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ తమ బ్రాండ్ విలువలకు కట్టుబడి సదరు మటన్ స్కేవర్ల ధరలో 50 శాతం మొత్తాన్ని ఖాతాదారులకు రీఫండ్ చేసింది.

**నిజాయితీయా? మార్కెటింగ్ జిమ్మిక్కా?**

ఈ భారీ వాపసు కార్యక్రమం నెట్టింట వైరల్‌గా మారడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'లాభాల కంటే కస్టమర్ల సంతృప్తికే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించిన రెస్టారెంట్ నిజాయితీ అమోఘం' అని మెజారిటీ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, మరికొందరు మాత్రం ఇది బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవడానికి, పబ్లిసిటీ కోసం ప్లాన్ చేసిన ఒక తెలివైన మార్కెటింగ్ వ్యూహం కావచ్చునని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

## స్పోర్ట్స్

# గిల్ గర్జన.. శుభ్‌మన్ సూపర్ సెంచరీ

**ఫైనల్లో గుజరాత్**

**క్వాలిఫయర్-2లో రాజస్థాన్ ఓటమి**

**వైభవ్ మెరుపులు వృథా**



**ముల్లన్‌పూర్ :** ఐపీఎల్19వ సీజన్‌లో బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ (47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96) మెరుపులకు.. రాజస్థాన్ రాయల్స్ పోరాటానికి తెరపడింది. 15 ఏండ్ల ఈ యువ కెరటం ఆడిన మరో అద్భుత ఇన్నింగ్స్ ఆ జట్టును ఫైనల్ చేర్చలేకపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104) క్లాసిక్ సెంచరీతో చేసిన గర్జనకు తోడు సాయి సుదర్శన్ (32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 58) సత్తా చాటడంతో రాజస్థాన్‌కు చెక్ పెట్టిన గుజరాత్ టైటాన్స్ మూడోసారి తుదిపోరుకు దూసు కెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2లో జీటీ 7 వికెట్ల తేడాతో రాయల్స్‌ను చిత్తు చేసింది. ఆర్ఆర్ ఇచ్చిన 215 టార్గెట్‌ను 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 214/6 స్కోరు చేసింది. వైభవ్‌తోపాటు జడేజా (45నాటౌట్) చివర్లో ఫెరీరా (11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38 నాటౌట్) కూడా రాణించారు. హోల్డర్, రబాడ చెరో రెండు వికెట్లు తీశారు. గిల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో ఆర్సీబీతో జీటీ అమీతుమీ తేల్చుకోనుంది.

**కెప్టెన్ గిల్ ముందుండి...**

క్వాలిఫయర్-1లో తేలిపోయిన గుజరాత్ టాపార్డర్ ఈసారి అద్భుతంగా ఆడింది. ఓపెనర్లు సుదర్శన్, గిల్ తొలి వికెట్‌కు 167 రన్స్ జోడించి ఫైనల్‌కు బాట వేశారు. భారీ ఛేదనలో క్లాసిక్ షాట్లతో హోరెత్తించారు. ఏ ఒక్క బౌలర్‌ను వదలకుండా శిక్షించి ఛేజింగ్‌ను వన్‌సైడ్ చేశారు. ఫామ్‌లో ఉన్న ఆర్చర్ తొలి ఓవర్లోనే చెరో రెండు ఫోర్లతో తమ ఉద్దేశం ఏంటో చెప్పారు. ఆర్చర్‌ను టార్గెట్ చేసిన గిల్ మరో రెండు ఫోర్లు రాబడితే.. బర్గర్, తుషార్‌కు సుదర్శన్ రెండేసి బౌండరీలతో స్వాగతం పలికాడు. ఓపెనర్ల జోరుకు పవర్‌ప్లేను 69/0తో ముగించింది. ఆ తర్వాత గిల్‌గేరు మార్చి మరింత స్పీడు పెంచారు. తుషార్ వేసిన తొమ్మిదో ఓవర్లో 6,4,4 బాది 30 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోవడంతో పాటు స్కోరు వంద దాటించాడు. పదో ఓవర్లో బంతిని అందుకున్న జడేజాను 6,6,4తో శిక్షించడంతో స్టేడియం హోరెత్తింది. కెప్టెన్‌ను చూసి సుదర్శన్ సైతం వేగం అందుకున్నాడు. యశ్‌రాజ్ బౌలింగ్‌లో తొలి సిక్స్ కొట్టి అర్ధ శతకం అందుకున్నాడు. ఈ జోరు చూస్తుంటే ఇద్దరే లక్ష్యాన్ని కరిగించేలా కనిపించారు. కానీ, బ్రిజేశ్ వేసిన 13వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన సాయి.. ఐదో బాల్‌ను కట్ షాట్‌తో బౌండరీకి పంపే ప్రయత్నంలో జారి పోయిన బ్యాట్ వికెట్లపై పడటంతో గత మ్యాచ్ మాదిరిగా హిట్ వికెట్‌గా ఔటయ్యాడు. జడ్డూ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఫోర్ కొట్టి సెంచరీ (47 బంతుల్లో) పూర్తి చేసుకున్న గిల్‌ను తర్వాతి ఓవర్లో ఆర్చర్ ఎల్బీ చేసినా అప్పటికే మ్యాచ్ జీటీ చేతుల్లోకి వచ్చేసింది. తెవాటియా (17 నాటౌట్), సుందర్ (16), బట్లర్ (9 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.

**పట్టువదలని సూర్యవంశీ**

తన స్టయిల్‌కు భిన్నంగా పరిస్థితులకు తగ్గట్టుగా ఆడిన వైభవ్ ముందుండి నడిపించగా.. చివర్లో ఫెరారీ మెరుపు బ్యాటింగ్‌తో రాజస్థాన్ మంచి స్కోరు చేసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు వచ్చిన ఆ టీమ్‌కు ఆరంభంలోనే వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. సిరాజ్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జైస్వాల్ (1)ను ఔట్ చేయగా.. రెండో ఓవర్లో జురెల్ (7)ను రబాడ వెనక్కుపంపడంతో ఆర్ఆర్ 9/2తో నిలిచింది. అయితే నాలుగో నంబర్‌లో వచ్చిన జడేజాతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నారు. పిచ్ నుంచి అంతగా సహకారం లేకపోవడం.. ప్రత్యర్థి పేసర్లు షార్ట్ పిచ్ బాల్స్, బౌన్సర్లతో పరీక్షిస్తుండగా.. వైభవ్ తన శైలికి భిన్నంగా జాగ్రత్తగా ఆడుతూనే చెత్త బాల్స్‌ను మాత్రం శిక్షించాడు. సిరాజ్ వేసిన మూడో ఓవర్లోనే మూడు ఫోర్లు కొట్టిన అతను రబాడ వేసిన 153 కి.మీ స్పీడ్ బంతిని స్ట్రెయిట్ సిక్స్‌గా కొట్టడం ఇన్నింగ్స్‌కే హైలైట్. మరో ఎండ్‌లో జడేజా కూడాక్రమం తప్పకుండా బౌండరీలు రాబట్టడంతో పవర్‌ప్లేను రాజస్థాన్ 70/2తో ముగించింది.

చేతి నొప్పి కారణంగా జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. తొమ్మిదో ఓవర్లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ పరాగ్ (11) 4,6 కొట్టి ఔటయ్యాడు. అతనితో పాటు షనక (3)ను హోల్డర్ పెవిలియన్ చేర్చగా.. మధ్యలో ప్రసిధ్ బౌలింగ్‌లో వైభవ్ ఇచ్చిన క్యాచ్‌ను సుదర్శన్ డ్రాప్ చేశాడు. అప్పటికి 46 రన్స్ వద్ద ఉన్న వైభవ్ ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో ఆర్చర్ (7) కీపర్‌కు చిక్కడంతో 118/5తో నిలిచిన జట్టును సూర్యవంశీ ఆదుకున్నాడు. 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అతను మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన జడేజా తోడుగా స్పీడు పెంచాడు. రబాడ, సిరాజ్ ఓవర్లలో ఒక్కో సిక్స్ కొట్టిన వైభవ్.. హోల్డర్ వేసిన 16వ ఓవర్లో 4,6,6తో స్కోరు 150 దాటించాడు. ఆపై స్పిన్నర్ సుందర్‌ను రెండు సిక్సర్లతో శిక్షించిన వైభవ్ సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ, 18వ ఓవర్లో రబాడ షార్ట్ పిచ్ బాల్‌ను అప్పర్ కట్ షాట్ ఆడిన సూర్య.. ప్రసిధ్‌కు క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు, స్పిన్నర్ రషీద్ వేసిన ఆఖరి ఓవర్లో నాలుగు సిక్సర్లతో విరుచుకుపడిన ఫెరీరా జట్టుకు మంచిస్కోరు అందించాడు.

సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 214/6 (వైభవ్ 96, జడేజా 45 నాటౌట్, హోల్డర్ 2/27, రబాడ 2/35);

గుజరాత్: 18.4 ఓవర్లలో 219/3 (గిల్ 104, సుదర్శన్ 58, ఆర్చర్ , బర్గర్1/35)


1 ఒక సీజన్‌లో 700 పరుగులు పూర్తి చేసిన తొలి అన్‌క్యాప్డ్ ప్లేయర్ వైభవ్. 2023లో జైస్వాల్ సాధించిన 625 పరుగుల రికార్డును అధిగమించాడు.

19 19 ఈ సీజన్ ప్లేఆఫ్స్ రెండు మ్యాచ్‌ల్లో వైభవ్ కొట్టి సిక్సర్లు, ఒక ఎడిషన్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా వృద్ధిమాన్ సాహా ( 2014లో 11) రికార్డును దాటేశాడు.

521 ఈ ఐపీఎల్ పవర్‌ప్లేలో వైభవ్ సూర్యవంశీ చేసిన రన్స్. ఒక సీజన్‌లో అత్యధిక పవర్ ప్లే రన్స్ చేసిన బ్యాటర్‌గా 2016లో వార్నర్ నెలకొల్పిన 467 పరుగుల రికార్డును బద్దలు కొట్టాడు.

5 ఐపీఎల్‌లో గిల్‌కు ఇది ఐదో సెంచరీ. కెప్టెన్‌గా రెండోది.

# జొకోవిచ్‌కు షాక్



పారిస్ : ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం. సెర్బియా లెజెండరీ ప్లేయర్ నొవాక్ జొకోవిచ్ అనామక ఆటగాడి చేతిలో ఓడి మూడో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. తొలి రెండు సెట్లు గెలిచి 2-0తో నిలిచిన దశలో వరుసగా మూడు సెట్లు కోల్పోయి అనూహ్యంగా ఓడిపోయాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో 28వ సీడ్ జావో ఫొన్సెకా (బ్రెజిల్) 4-6, 4-6, 6-3, 7-5, 7-5తో మూడో సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చాడు. స్పెయిన్ ఆటగాడు పాబ్లో కారెనో బుస్టా 7-6 (0), 7-5, 3-6, 6-4తో అర్జెంటీనా ప్లేయర్ తిరాంతెను ఓడించగా.. రుబ్లెవ్ 7-5, 7-6 (7/2), 7-6 (7/2)తో నునో బోరగ్స్‌పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో పోలెండ్ స్టార్ స్వియాటెక్ 6-4, 6-4తో మగ్దా లినెట్‌ను ఓడించగా.. ఏడో సీడ్ స్వితోలినా 6-2, 6-3తో కార్సాచ్‌పై, ఎనిమిదో సీడ్ ఆండ్రీవా 6-4, 6-2తో మేరీ బౌజ్కోవాపై నెగ్గి ముందంజ అయితే, అన్‌సీడెడ్ టీచ్‌మన్ 6-1, 7-5తో గత సీజన్ రన్నరప్ కరోలినా ముచోవాకు షాకిచ్చింది.



# అయిదుగురు హీరోయిన్లతో సినిమా?

గమ్యం, వేదం, కృష్ణంవందే జగద్గురుమ్, కంచె వంటి గొప్ప సినిమాలను తెరకెక్కించి అభిరుచి గల దర్శకుడిగా కితాబులందుకున్నారు దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. సందేశాత్మక కథలకు వాణిజ్యఅంశాలను జోడించి జనరంజక చిత్రాలను అందించడం క్రిష్ ప్రత్యేకత. అయితే.. గత కొన్నేళ్లుగా క్రిష్ కెరీర్ సరైన ట్రాక్‌లో లేదు. ఎన్టీయార్ కథానాయకుడు, మహానాయకుడు, కొండపొలం, ఘాటీ చిత్రాల ఫలితాలు ఆయన కెరీర్‌పై తీవ్రమైన ప్రభావాన్నే చూపాయి. అందుకే.. గత వైభవాన్ని దక్కించుకునేందుకు ఈ సారి పకడ్బందీ వ్యూహంతో ముందుకెళు_న్నారట క్రిష్.

ఈ సారి కాస్టింగ్‌పై కాకుండా కథపైనే ఎక్కువ శ్రద్ధపెట్టి, ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌ని ప్రేక్షకులకు అందించే ప్రయత్నాల్లో ఆయన బిజీగా ఉన్నారట. అయిదుగురు అమ్మాయిల నేపథ్యంతో కూడిన ఓ కథను ఆయన ప్రస్తుతం తెరకెక్కిస్తున్నట్టు తెలిసింది. ఈ అయిదు ప్రధాన భూమికలకు అయిదుగురు యంగ్ హీరోయిన్లను ఎంపిక చేసినట్టు వినికిడి. ఇప్పటికే ఎలాంటి హడావిడి లేకుండా చిత్రీకరణ కూడా మొదలైంది. క్రిష్ గత చిత్రాల మాదిరిగానే ఆలోచింపజేసే కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందట. ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రాజీవ్‌రెడ్డి, జాగర్లమూడి సాయిబాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




# పెద్ది మేకర్స్ అలర్ట్.. ఆ ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు..!

రామ్ చరణ్ పెద్ది మేకర్స్ రిలీజ్‌కు ముందు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మూవీ పైరసీ, లీక్ విషయంలో మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించగా.. వీరికి అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలకు మార్గం సుగమమైంది. తాజాగా పెద్దిపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలకు దిగింది. ఈ సినిమాపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు కావాలనే నెగెటివ్ ప్రచారం చేస్తున్నట్లు పెద్ది టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో పోలీసులకు మేకర్స్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు సోషల్ మీడియా కార్యకలాపాలపై పెద్ది మూవీ టీమ్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న పెద్ది మూవీ జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.



# ఈ అభిమానం ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్. ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.



# విజయ్ దేవరకొండ బాలీవుడ్ చిత్రం?

పాన్ ఇండియా సినిమాల ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు సుపరిచితుడయ్యారు అగ్రహీరో విజయ్ దేవరకొండ. తాజా సమాచారం ప్రకారం ఆయన తొలి హిందీ స్ట్రెయిట్ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. వైవిధ్య చిత్రాల దర్శకుడు విక్రమ్ కె కుమార్ డైరెక్షన్‌లో విజయ్ దేవరకొండ ఓ చిత్రాన్ని చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలొస్తున్నాయి. యూవీ క్రియేషన్స్ ఈ సినిమా నిర్మాణం చేపట్టనుందని ప్రచారం జరిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మ్యాడ్‌డాక్ ఫిల్మ్స్ తెరకెక్కించనుందని సమాచారం. ఇటీవల ముంబయిలోని ఆ సినిమా ఆఫీసులో విజయ్ దేవరకొండ, విక్రమ్ కె కుమార్ ఇద్దరూ కనిపించడంతో ఈ వార్తలకు మరింతగా బలం చేకూరినట్లయింది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారని సమాచారం. అయితే ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'రణబాలి' 'రౌడీ జనార్ధన' చిత్రాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఏడాదిలోనే ఇవి ప్రేక్షకుల ముందుకురానున్నాయి.

# ఈ ప్రేమకథ 'రోమాంచకం'



అర్జున్ రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్స్‌ను అందించిన నిర్మాణ సంస్థ భద్రకాళీ పిక్చర్స్ తెరకెక్కిస్తున్న తాజా తెలుగు చిత్రానికి 'రోమాంచకం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ఆయన సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శుక్రవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్ అండ్ పొయెటిక్ ఫీల్‌తో పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్ కథపై ఆసక్తినిరేకెత్తిస్తున్నది. నవ్యత కలబోసిన ప్రేమకథా చిత్రమిదని, త్వరలో మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని మేకర్స్ తెలిపారు. ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, నరేంద్ర రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వాసుకి వైభవ్, సమర్పణ: సందీప్‌రెడ్డి వంగా, నిర్మాత: ప్రణయ్ రెడ్డి వంగా, రచన-దర్శకత్వం: వేణుగోపాల్ రెడ్డి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967